సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



వైభవునికి పంచామృతాభిషేకం

మురళీనగర్ : విశాఖలోని వైభవ వేంకటేశ్వరస్వామి గుడిలో పూర్ణిమ సందర్భంగా గురువారం పంచామృతాభిషేకం నిర్వహించారు.



కటాఫ్ డేట్ మార్చాల్సిందే..

ఇండస్ట్రియల్ కారిడార్ భూములకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో కటాఫ్ డేట్ మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. 8లో



తీరం అల్లకల్లోలం

వాయుగుండం ప్రభావంతో గురువారం విశాఖ సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. 8లో

లేచింది మహిళా లోకం

దద్దరిల్లింది మద్య ప్రపంచం



కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే మహిళల నుంచి అసంతృప్తి సెగలు, ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. అసలే మహిళలపై లైంగిక దాడులు ఎక్కువైన నేపథ్యంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కావడం వారిని కలవరపాటుకు గురి చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్ల ప్రభుత్వ మద్యం దుకాణాలు నియమ నిబంధనలు పాటిస్తూ కొత్త ఒరవడి సృష్టించాయి. అందుకు భిన్నంగా ప్రైవేటు మద్యం దుకాణాలు వెలియడం.. అవి నిబంధనలను పాటించకపోవడం విమర్శల పాలైంది. అది మహిళల్లో నిరసన వెల్లువెత్తేలా చేసింది. వారి ఆందోళనలతో పలుచోట్ల మద్యం దుకాణాలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జనావాసాల మధ్య మద్యం దుకాణమా?



మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

- అనకాపల్లి శారదానగర్‌లో మహిళల ఆందోళన
- మూతబడ్డ వైన్ షాపు

అనకాపల్లి: ప్రజల జీవితాలతో ఆటలాడవద్దని మహిళలు అధికారులకు స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా నెలకొన్న ప్రశాంతతను భగ్నం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కొత్తూరు పంచాయతీ పరిధి శారదానగర్ 2వ వీధిలో జనావాసాల మధ్య బుధవారం రాత్రి కొత్తగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో నిరసన వెల్లువెత్తింది. విషయం తెలుసుకున్న మహిళలు శారదా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని తక్షణమే మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని ధర్నా చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే పనులను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వైన్‌షాప్ వద్ద మహిళలు బైఠాయించడంతో విషయం తెలుసుకున్న పట్టణ సీఐ టీవీ విజయకుమార్, ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. వారం రోజుల్లో దుకాణాన్ని మరో చోటకు తరలిస్తారని ఎక్సైజ్ సీఐ నచ్చచెప్పారు. ప్రస్తుతం దుకాణం మూసివేసి ఉంది. శారదానగర్ 2వ వీధిలో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడుకు, జిల్లా ఎక్సైజ్ అధికారికి వినతిపత్రాలు అందజేశారు.

ప్రార్థనా మందిరాన్నీ వదలరా?



కొత్తకోటలో చర్చి పక్కన ఏర్పాటు చేసిన బ్రాందీ షాపు వద్ద మహిళల ధర్నా

- చర్చి సమీపంలో బ్రాందీషాపు ఏర్పాటుపై ఆందోళన
- కొత్తకోటలో ప్రారంభించిన కొద్ది గంటలకే మూసివేత

రావికమతం (చోడవరం): చర్చికి సమీపంలో బ్రాందీ షాపును ప్రారంభించడంతో క్రైస్తవ మహిళలు ఆందోళనకు దిగారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో రెండు బ్రాందీ షాపులు ఏర్పాటు చేశారు. రెండో దుకాణాన్ని మాకవరపాలెం రోడ్డులో చర్చికి సమీపంలో గురువారం ప్రారంభించారు. దీంతో క్రైస్తవులు ఆందోళనకు దిగారు. దేవాలయాలు, చర్చిలు, పాఠశాలలు, మసీదులకు దగ్గర్లో బ్రాందీ షాపులు పెట్టకూడదనే నిబంధనను తుంగలోకి తొక్కి సదరు బ్రాందీషాపు యజమాని ఏకంగా చర్చికి అతి దగ్గర్లోనే బ్రాందీ షాపు ప్రారంభించాడు. దీంతో చర్చికి వచ్చిన క్రైస్తవులు,ప్రధానంగా మహిళలు ఆందోళనలో పాల్గొన్నారు. షాపు ముందు వారంతా ధర్నా చేయడంతో ఉదయం ప్రారంభించిన బ్రాందీ షాపును వెంటనే మూసివేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ గరగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చర్చ్ ఆఫ్ క్రీస్తు సొసైటీ పేరున ఈ చర్చిని నిర్మించారని, పవిత్ర ప్రార్థనా మందిరం దగ్గర బ్రాందీ షాపును ఏర్పాటు చేయడం వల్ల తాగుబోతులతో చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఎందుకు అనుమతి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

దేశ రక్షణలో రాజీ ప్రసక్తే లేదు

నేవీ జెట్టీ ప్రారంభించిన నౌకాదళాధిపతి



నేవీ జెట్టీని ప్రారంభిస్తున్న భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి పునరుద్ఘాటించారు. విశాఖలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన సతీమణి, నేవీ వెల్ఫేర్ వెల్‌నెస్ అసోసియేషన్(ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఏ) ప్రెసిడెంట్ శశి త్రిపాఠీతో కలిసి తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నావికాదళానికి సంబంధించి అత్యాధునిక ఎన్1–ఎన్3 జెట్టీని అడ్మిరల్ త్రిపాఠీ ప్రారంభించారు. పూర్తిస్థాయి మోడ్రన్ సపోర్ట్ ఫీచర్స్‌తో యుద్ధ నౌకల బెర్తింగ్‌కు అనుగుణంగా ఈ జెట్టీని నిర్మించారు. తూర్పు నౌకాదళ అమ్ములపొదిలోకి అదనపు యుద్ధ నౌకలు చేరుతున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో అదనపు బెర్తింగ్‌కు ఈ జెట్టీ కీలకంగా మారుతుందని నేవీ చీఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఈస్టన్ ఫ్లీట్‌లో ఉన్న యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో నేవీ చీఫ్ సంభాషించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్ ప్రారంభం



ప్రీపెయిడ్ ట్యాక్సీ తొలి వినియోగదారునికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ బాగ్చి

సాక్షి, విశాఖపట్నం : ప్రయాణికులు సురక్షితంగా ఎయిర్‌పోర్టు నుంచి తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు ప్రీపెయిడ్ ట్యాక్సీ సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. గురువారం ఎయిర్‌పోర్టు ఆవరణలో ఈ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ప్రీపెయిడ్ ట్యాక్సీకీ జీపీఎస్‌ని అనుసంధానం చేశామని.. ఏ కారణం చేతనైనా అనుకున్న సమయానికి ట్యాక్సీ గమ్యస్థానానికి చేరకపోతే తక్షణమే దాన్ని ట్రాక్ చేసే వీలుంటుందన్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ నడిపే డ్రైవర్లందరూ పూర్తి శిక్షణ కలిగి ఉండడంతో పాటు వారి పర్సనల్ డేటా కూడా తమ వద్ద ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు



విభాగంలో పరిశీలిస్తున్న రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు గురువారం పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు, సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, బోధనా విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఆరోగ్యకర వాతావరణంలో బోధించాలని సూచించారు.

జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ : జాతీయ యువజన ఉత్సవాలు 'ప్రజాతంత్ర 2024'కు రాష్ట్రం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. వీసీ ఆచార్య జి.శశిభూషణరావు గురువారం తన కార్యాలయంలో వీరిని అభినందించారు. నవంబర్ 16 నుంచి 18 వరకు లక్నోలో జరిగే ఈ యువజన ఉత్సవాలలో రాష్ట్రం తరపున ఏయూ నుంచి ఎం.శివాని లహరి, డి.హర్షిత ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలి



ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష జరుపుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

- ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచాలి
- సమీక్షలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి : వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించి, వాటి ఎగుమతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో గల ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయించడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. ఉద్యాన శాఖకు వంద రోజుల ప్రణాళిక కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచాలని, రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయిల్‌పాం 245 హెక్టార్ల లక్ష్యం కాగా, 335 హెక్టార్లలో పూర్తి చేసి, దాదాపు 137 శాతం సాగు లక్ష్యం సాధించినందుకు అధికారులను అభినందించారు. బొప్పాయి, జామ, జీడి మొదలగు పంటల సాగు లక్ష్యం 100 హెక్టార్లు కాగా, లక్ష్యాన్ని మించి 127.4 హెక్టార్లలో సాగు పూర్తి చేసి 127 శాతం సాధించామన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, మండల ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

తుమ్మపాల : వ్యవసాయ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది, పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. రైతుల రిజిస్ట్రేషను, ఈ–కేవైసీ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వరి పంట మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తి కావడం లేదని, పప్పు ధాన్యాలు, సిరిధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల పరిశీలన, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై సమాచార పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లచ్చన్న, వ్యవసాయశాఖ ఏడీఏ, మండల ఏవోలు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

దాబాగార్డెన్స్ (విశాఖ):

మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 85 అజెండా అంశాలు పొందుపరిచారు. కాగా.. సభ్యుల మధ్య డీల్ కుదిరితే వారిలో వారే చర్చించుకుని అంశాలను ఆమోదిస్తున్నారు. లేకపోతే అధికారులను నిలదీస్తూ.. ఆ వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. తర్వాత ఆ అంశాన్ని వాయిదా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నూతన స్థాయీ సంఘ సభ్యులు ఇదే తీరును ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ఆమోదం తెలపకుండా కొర్రీలు పెడుతున్నారు. జోన్–2 పరిధి 6వ వార్డులోని డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర'కార్యక్రమంలో తాగునీటి సరఫరా, 20 లీటర్ల వాటర్ క్యాన్లు, బ్యానర్లు, స్టీల్ గ్లాసులు, టీ షర్ట్స్ వంటివి కార్మికులకు అందజేశారు. ఆ అంశాన్ని సభ్యులు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. జోన్–3 పరిధి ఏయూ దూరవిద్యా విభాగం సౌత్ ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ నిర్వహించారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారుల కోసం తాత్కాలిక వాష్ రూమ్‌ల్లో శానిటరీ, నీటి సరఫరా, విద్యుద్దీకరణ పనులు జరిగాయి. పరిపాలన అనుమతికి గత స్థాయి సమావేశంలో పొందుపరచగా సభ్యులు నిర్ణయం తీసుకోవడం లేదు. జోన్–3 పరిధి 21వ వార్డులోని కోకో ఎరీనాలో ఎల్ఈడీ లైట్ల కోసం కొత్త కేబుల్ వేసేందుకు, అదే వార్డులో వైఎంసీఏ నుంచి ఆర్.కె.బీచ్ వరకు విద్యుత్ స్తంభాల సుందరీకరణ పనులను వాయిదా వేస్తుండటం గమనార్హం.

జల జీవనం



రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం, భోగాపురం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగ గెడ్డ

- అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

తుమ్మపాల: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 298.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 45.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా బుచ్చెయ్యపేట మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. రాంబిల్లి మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు, పంట కాలువలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. మైనర్ శారద, శారదానదిలోకి పైనుంచి నీరు అధికంగా చేరడంతో పరవళ్లు తొక్కుతున్నాయి. శారదానది దిగువన ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం, భోగాపురం గ్రామాల మధ్య ఉన్న దొంగగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మునగపాక మండలం తిమ్మరాజుపేటలో భారీ వర్షం కురవడంతో వర్షపునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మునగపాక బీసీ కాలనీల్లో పలు చోట్ల వర్షపునీరు రహదారులపై నిలిచిపోయింది. కోటకోట ప్రాంతంలో గురువారం దఫదఫాలుగా కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగేందుకు అవస్థలు పడ్డారు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీమీటర్లు
రాంబిల్లి	45.2
అచ్యుతాపురం	44.2
పరవాడ	32.2
నక్కపల్లి	27.4
ఎస్.రాయవరం	20.2
మునగపాక	17.8
పాయకరావుపేట	17.4
సబ్బవరం	10.0

ప్రమాదస్థాయికి చేరువలో 'తాండవ'

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరువలో ఉంది. గురువారం సాయంత్రానికి 377.3 అడుగుల నీరు ఉంది. తాండవ ఆయకట్టు భూములకు ప్రధాన గేట్ల నుంచి పంట కాలువల ద్వారా రోజుకు 555 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరిందని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు అధికంగా ఉండి 378 అడుగులు చేరే సరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తామన్నారు.

వైద్య సేవ.. ఉపాధికి తోవ





ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ ఇస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు (ఫైల్)

- ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు ఆదరణ
- మహిళా విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు
- కోర్సు పూర్తయిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు



ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి

అనకాపల్లి: విస్తృత ఉపాధి అవకాశాలు.. పదో తరగతి తర్వాత రెండేళ్ల చదువు, ఏడాది శిక్షణతో స్థిరపడే చాన్స్.. ఈ కారణంగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సుకు ఆదరణ పెరిగింది. గ్రామీణం, పట్టణం తేడా లేకుండా ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేట్ హాస్పటల్స్‌లో ఉద్యోగం లభించే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఈ కోర్సుకు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బాలికలకు ఎక్కువ అవకాశాలు ఉండడంతో ప్రైవేటు మహిళా కళాశాలలు కూడా నడుస్తున్నాయి. టెన్త్ తర్వాత ఈ కోర్సులో చేర్చుకుంటారు. ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్, జనరల్ ఫౌండేషన్ కోర్సు, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, హెల్త్ ప్రమోషన్, ప్రైమరీ హెల్త్ కోర్సు సబ్జెక్టులు ఉంటాయి. ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్, చైల్డ్ హెల్త్ నర్సింగ్, జీఎఫ్‌సీ మిడ్ వైఫరీ, హెల్త్ సెంటర్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతోపాటు బ్రిడ్జి కోర్సులు (ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) బోధిస్తారు. రెండు సంవత్సరాలు ఒకేషనల్ కళాశాలలో చదువుకుంటే మరో సంవత్సరం ప్రభుత్వం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేసిన వందలాదిమంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలో ఉపాధ్యాయ, ఉషోదయ, ఆదినారాయణ మహిళా, ఎస్.వి.ఎస్, రవి ఒకేషనల్ కళాశాలల్లో ఈ కోర్సు అందిస్తున్నారు.

- ప్రైవేట్ కళాశాలల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యార్థులు శిక్షణ తీసుకోవాలంటే విద్యార్థులు చదువుతున్న కళాశాల యాజమాన్యం ప్రభుత్వ వైద్యవిభాగం డైరెక్టర్‌కు రూ.20 వేలు డీడీ రూపంలో చెల్లించాలి.
- అక్కడ నుంచి కళాశాలకు ఒక లెటర్, మరో లెటర్ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంది.
- ఏడాదిపాటు ఆస్పత్రుల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆస్పత్రి హెడ్‌నర్సింగ్ విభాగానికి అప్పగిస్తారు. శిక్షణ సమయంలో ఎ, బి, సి విభాగాల్లో విధులు నిర్వహించవలసి ఉంటుంది.
- గత 5 సంవత్సరాలుగా ఎన్టీఆర్ వైద్యాలయంలో పట్టణ పరిధిలో వివిధ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.
- శిక్షణ అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్‌తో విద్యార్థి ఎంపీ మెడికల్ కౌన్సెలింగ్‌కి వెళ్లి ఉపాధి కోసం దరఖాస్తు చేసుకుంటే స్వయం ఉపాధి కోసం చర్యలు తీసుకుంటారు.
- పట్టణ పరిధిలో 5 కళాశాలలకు చెందిన 150 నుంచి 180 మంది విద్యార్థులు ఎన్టీఆర్ ఆస్పత్రిలో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు.
- ఆస్పత్రిలో రోగికి సేవలు చేయడం, వైద్యులకు, పర్మినెంట్ వైద్య సిబ్బందికి తోడుగా ఉంటూ రోగులకు సకాలంలో వైద్యం అందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నారు.
- శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు స్వయంగా ఇంటి వద్దనే రోగికి ఫస్ట్ ఎయిడ్ చేసే అవకాశం ఉంటుంది.

శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగం



కోర్సు పూర్తయిన వెంటనే ప్రైవేట్ ఆస్పత్రిలో ఉపాధి దొరుకుతుంది. సంప్రదాయ కోర్సులు చదివితే మంచిది. పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు దొరకాలంటే కష్టంగా ఉంటుంది. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుతో ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

–పి.శ్రావణి, విద్యార్థిని

రోగులకు వైద్యం.. విద్యార్థులకు శిక్షణ



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఇది వారికి మంచి అవకాశం. జిల్లా ఆస్పత్రి కావడంతో ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థుల సాయంతో సకాలంలో రోగికి వైద్యం అందిస్తున్నాం. రోగులకు ఒకపక్క వైద్యం అందుతుండగా.. ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులకు చక్కని శిక్షణ లభిస్తుంది. ఆస్పత్రుల్లో శిక్షణ పొందడంతో విద్యార్థులకు రోగాలపై అవగాహన పెరుగుతుంది. ఈ అనుభవం వారికి భవిష్యత్తులో పనికొస్తుంది.శిక్షణ కాలంలో ఎటువంటి స్టైఫండ్ ఉండదు. ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ మాత్రమే విద్యార్థికి అందజేస్తున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్, అనకాపల్లి

ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది



గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది. గతంలో వైద్యం కోసం పట్టణానికి వెళ్లేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నాయి. ఇంటి వద్దనే ఉద్యోగం చేస్తూ జీవించవచ్చు.

–ఎస్.మౌనిక, విద్యార్థిని

కారణజన్ముడు వాల్మీకి మహర్షి

- జయంతి కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల : రాముని జీవితాన్ని కావ్యరూపంలో అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవితో కలిసి వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామకథను రామాయణ మహాకావ్యంగా రచించిన వాల్మీకి మహర్షి కారణజన్ముడని తెలిపారు. రామాయణ కావ్యం ప్రేమానురాగాలకు ప్రతీక అని, రాముడు నేర్పిన విలువలను మన భావితరాలకు అందించాలని తెలిపారు. రామాయణంలోని సంఘటనలు మనిషి జీవితంలో ప్రతి దశలోను కనిపిస్తాయని తెలిపారు. ఎటువంటి మాటపడకుండా, మచ్చలేకుండా రాముడు పరిపాలన చేసి ఆదర్శంగా నిలిచారని, వారి స్ఫూర్తిగా ప్రతి ఉద్యోగి కూడా నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ 'మనిషి సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చుని వాల్మీకి మహర్షి నిరూపించారన్నారు. డీఆర్వో బి.దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరద బాధితుల సహాయార్థం రూ.2.5 లక్షల విరాళం



కలెక్టర్‌కు విరాళ చెక్కు అందిస్తున్న స్పైరాక్స్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు

తుమ్మపాల: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పరవాడలోని స్పైరాక్స్ ఫార్మా కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.50 లక్షల విరాళం అందించింది. ఆ చెక్కును కలెక్టర్ విజయ కృష్ణన్‌కు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరెడ్డి గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు ధరల షాక్



కశింకోటలో ప్రారంభమైన మద్యం అమ్మకాలు

కశింకోట: మద్యం ధరలు తగ్గించి మందుబాబులకు ఊరట కలిగిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు.. అధిక ధరలతో షాక్ ఇచ్చారు. ధరలు తగ్గకపోవడంతో మందుబాబులు తీవ్ర నిరాశ చెందారు. మండలంలో ఆరు దుకాణాలను ఇటీవల తీసిన లాటరీలో వ్యాపారులు దక్కించుకున్నారు. ఈ ప్రైవేటు మద్యం దుకాణాల్లో అమ్మకాలు గురువారం ప్రారంభమయ్యాయి. వీటిలో రెండింటిని కశింకోటలోని సంతబయలలో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మేరకు ధరలు తగ్గాయేమోనని మందు ప్రియులు దుకాణాలకు ఎగబడ్డారు. తీరా ధరలు తగ్గకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. పాత ధరలకే, గతంలో విక్రయించే మద్యాన్నే విక్రయిస్తున్నారు. స్టాక్ ఉన్నందున దాన్ని విక్రయిస్తున్నామని, వచ్చే నెల నుంచి మద్యం ధరలు తగ్గుతాయని మందుబాబులకు నిర్వాహకులు సర్ది చెబుతున్నారు. ఇలా చెబుతారు తప్ప, ఇంకా తగ్గేదేం ఉండదంటూ మందుబాబులు నిట్టూర్చారు.

‘జల’ విజేత.. విశాఖ

ఉమ్మడి విశాఖ జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు.. దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టిన జలవనరుల అభివృద్ధికి జాతీయ జల్‌జీవన్ మిషన్ పట్టం కట్టింది. 2023 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ జల అవార్డుల్లో దక్షిణాదిలోని అన్ని జిల్లాలను వెనక్కి నెట్టి విశాఖ అగ్రస్థానంలో నిలిచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ‘మిషన్ అమృత్ సరోవర్’పథకం అములులో జిల్లా సాధించిన అద్భుత ఫలితాలే ఈ విజయానికి కారణం. –సాక్షి, విశాఖపట్నం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జల సంరక్షణకు ప్రాధాన్యం
- అమృత్ సరోవర్ పథకం కింద 33 జల వనరుల పునరుద్ధరణ
- జలశక్తి అవార్డుల్లో సౌత్ జోన్‌లో నంబర్‌వన్‌గా ఉమ్మడి విశాఖ జిల్లా
- 2023లో అద్భుత ప్రగతి సాధించిందని కేంద్ర ప్రభుత్వ కితాబు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ‘మిషన్ అమృత్ సరోవర్’ పథకాన్ని అమలు చేసింది. ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పకడ్బందీగా మిషన్ అమృత్ సరోవర్‌ను అమలు చేసి 2023లో అద్భుత ఫలితాలు సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంపిక చేసిన చెరువుల్లో ముళ్ల పొదల తొలగింపు, పూడకతీత, గట్లు పటిష్టం చేసే పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టారు.



ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు

కేంద్రం కితాబు

2023లో మిషన్ అమృత్ సరోవర్ పథకం అమలులో విశాఖ జిల్లా అద్భుతంగా పనిచేసిందంటూ కేంద్రం కితాబిచ్చింది. ఈ నెల 14న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన 5వ జాతీయ జల అవార్డుల్లో విశాఖ జిల్లా సత్తా చాటింది. 2023 సంవత్సరానికి గానూ 9 విభాగాల్లో విజేతలను ప్రకటించింది. దక్షిణాదిలో ఉన్న ఐదు రాష్ట్రాల్లో బెస్ట్ డిస్ట్రిక్ట్ అవార్డును విశాఖపట్నం సొంతం చేసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని 132 జిల్లాలను వెనక్కి నెట్టి విశాఖ నంబర్ వన్ స్థానంలో నిలిచింది.

2023లో సాధించిన విజయాలివీ..

- అమృత్ సరోవర్ పథకం కింద 33 నీటి వనరుల పునరుద్ధరణ చేపట్టారు.
- సుమారు 2,400 వివిధ కృత్రిమ రీచార్జ్ నిర్మాణాల పునరుద్ధరణ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 87.74 కిలోలీటర్ల నీరు ఆదా అవుతోంది.
- శారదా నది కోతకు గురికాకుండా.. నదీ పరివాహకం కింద ఉన్న వేల ఎకరాలు నీటి పాలవ్వకుండా చర్యలు చేపట్టారు. నదికి ఇరువైపులా సుమారు 336 మీటర్ల మేర గట్ల ఆధునికీకరణ, పూడికతీత పనులు చేపట్టారు. దీని ద్వారా నదీ పరివాహకంలోని 35,000 ఎకరాలను సంరక్షించడం ద్వారా 20,600 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. అంతే కాకుండా వరద ముంపు బారి నుంచి మైదాన ప్రాంతాలను సంరక్షించారు.
- నగర పరిధిలోని ముడసర్లోవ రిజర్వాయర్‌లో పూడిక తీత పనులను చేపట్టారు. తద్వారా రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 20 శాతం పెరిగింది. దీంతో పాటు ముడసర్లోవ రిజర్వాయర్‌లో గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా మంచి ఫలితాలు రాబట్టారు.
- ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన 2.0 పథకంలో భాగంగా 79.77 కిలో లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో ఏకంగా 28 చెరువుల తరహా నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణల వల్ల పరిసర ప్రాంతాల్లో గతంలో కంటే మిన్నగా భూగర్భ జలాలు పెరిగాయి. పంటలకు నీటి వనరులు పుష్కలంగా లభ్యమయ్యాయి.



కె.కోటపాడులో అమృత్ సరోవర్‌లో భాగంగా యాళ్లబంద చెరువుకు కొత్త రూపు

- పర్యావరణాన్ని సంరక్షించేందుకు 2023లో 2 లక్షలకు పైగా చెట్లను నాటారు. అప్పటికే ఉన్న చెట్లు, మొక్కలను సంరక్షించే విషయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కితాబిచ్చింది.
- భవిష్యత్తులో చెరువులు ఆక్రమణలకు గురికాకుండా గత ప్రభుత్వం కీలకమైన అడుగు వేసింది. జిల్లాలో అందుబాటులో ఉన్న మొత్తం 491 నీటి వనరులను జియో ట్యాగింగ్ చేసి రెవెన్యూ రికార్డుల్లో అప్‌లోడ్ చేయించింది.

ఇలా.. విభిన్న విభాగాల్లో నీటి వనరుల సంరక్షణకు గత ప్రభుత్వం తీసుకున్న అద్భుత చర్యలు, విశాఖ జిల్లాను దక్షిణాది రాష్ట్రాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టాయి. ఈ పనులన్నింటినీ కొలమానంగా తీసుకుని సదరన్ రీజియన్‌లో విశాఖ జిల్లాను అవార్డుకు ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



జలసిరితో కళకళలాడుతున్న ఆర్‌యూ అగ్రహారం చవిటి బంద చెరువు

ఆన్ డ్యూటీ కాదు.. ఓన్ డ్యూటీ..!

- వీఎంఆర్డీఏలో ఓ ఉన్నతాధికారి స్వరూపం బట్టబయలు
- విజయనగరంలోని సొంత పొలంలో సంస్థ కార్మికులతో పనులు
- మూడేళ్లుగా ఇదే తంతు.. ప్రశ్నించిన 11 మంది కార్మికులపై వేటు

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ మేము లోకల్.. అన్న తీరుతో కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్నారు. సంస్థ ఆస్తులు, సిబ్బంది, కార్మికులను సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. తాజాగా ఒక ఉన్నతాధికారి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ అధికారికి విజయనగరం జిల్లా అయ్యన్నపేట ప్రాంతం కరకవలస కాలనీని ఆనుకుని 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో పనులు చేస్తున్న కార్మికులు వీఎంఆర్డీఏకు చెందిన వారు కావడం గమనార్హం.

మస్తర్లు ఇక్కడ.. పనులు అక్కడ.!

వీఎంఆర్డీఏలో సదరు ఉన్నతాధికారి తన పలుకుబడితో సంస్థలో చక్రం తిప్పుతున్నారు. మూడేళ్లుగా వీఎంఆర్డీఏ పరిధిలోని కైలాసగిరి, హెల్త్ ఎరీనా, సెంట్రల్ పార్క్‌లలో పని చేసే కార్మికులు 10 నుంచి 15 మందిని తన వ్యవసాయ భూమిలో పనులకు వినియోగించుకుంటున్నారు. అయితే మస్తర్లు మాత్రం ఇక్కడ పని చేస్తున్నట్లే చూపిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.560 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. సంస్థ నుంచి కార్మికులకు వేతనాలు చెల్లిస్తూ.. ఏళ్ల తరబడి సొంత పనులు చేయించుకుంటున్నప్పటికీ.. ఉన్నతాధికారులు కనీసం దృష్టి పెట్టకపోవడం గమనార్హం. దీనిపై కొంత మంది కార్మికులు ఆ అధికారిని ఇటీవల ప్రశ్నించారు. దీంతో సదరు అధికారి 11 మంది కార్మికులపై కక్షగట్టి తొలగించారు. వారి స్థానంలో వేరే వారికి పనులు అప్పగించారు. దీనిపై బాధిత కార్మికులు వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి తమ గోడు విన్నవించుకోవాలని నిర్ణయించారు.

కటాఫ్ డేట్ మార్చాల్సిందే..

- ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణపై రైతుల డిమాండ్
- నిర్వాసిత గ్రామాల్లో అధికారుల గ్రామసభలు

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో 2016 సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా ప్రకటించి నష్ట పరిహారం చెల్లించాలని నిర్వాసిత రైతులు మరోసారి స్పష్టం చేశారు. గురువారం మూలపర, డీఎల్ పురం తదితర నిర్వాసిత గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి మాట్లాడుతూ సేకరించిన భూములన్నింటికీ నష్ట పరిహారం చెల్లించామన్నారు. త్వరలోనే ఆయా భూములను స్వాధీనం చేసుకుంటామని, రైతులు సహకరించాలన్నారు. చాలా మంది రైతులు తమకు పరిహారం అందలేదని, ఇళ్లకు, సాగు చేస్తున్న భూములకు పరిహారం చెల్లించాలంటూ ఇటీవల కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టామన్నారు. చాలా మంది ప్రభుత్వానికి చెందిన రస్తా, గెడ్డలు, వాగులు, చెరువుల్లో సాగు చేస్తున్నామని, రస్తాలు, గోర్జుల్లో ఇళ్లు నిర్మించుకున్నామని, పరిహారం చెల్లించాలని దరఖాస్తు చేశారన్నారు. నిబంధనలు, భూసేకరణ చట్టం ప్రకారం ఇటువంటి వాటికి నష్ట పరిహారం చెల్లించడం కుదరదని స్పష్టం చేశారు. జిరాయితీ, డీ ఫారం రైతులకు ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించామన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో త్వరలో పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. ఇటీవల కాలంలో రైతులు పెట్టుకున్న అర్జీలకు సంబంధించి విచారణ జరిపి, వారికి ప్రభుత్వం తరపున ఎండార్స్‌మెంట్‌ను ఈ గ్రామసభల్లో అందజేశారు. కొంత మంది రైతులు తమ భూములకు పరిహారం అందలేదని ఫిర్యాదు చేయగా.. వారికి సంబంధించిన పరిహారం ఎవరి ఖాతాల్లో జమ అయ్యిందో ఆధారాలు, పేర్లతో సహా వివరించారు. వారి నుంచి రికవరి చేసి అర్హులైన రైతులకు చెల్లిస్తామన్నారు. ఈ గ్రామ సభల్లో రైతులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీపై మరోసారి గళం విప్పారు. 2010లో భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి, 2016లో పరిహారం చెల్లించారని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి మాత్రం 2010 సంవత్సరాన్ని కటాఫ్ డేట్‌గా ప్రకటించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కటాఫ్ డేట్ మార్చకపోతే భూముల్లోకి రానిచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ అధికారులు, రైతులు గంటా నర్సింగరావు, పెదపూడి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



కటాఫ్‌డేట్ మార్చాలని తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

అభిజిత్ కంపెనీ లే-ఆఫ్ దారుణం



అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



అచ్యుతాపురం రెవెన్యూ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

- తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన
- న్యాయం చేయాలని వినతి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కంపెనీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ సోమునాయుడు మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ అక్రమ లే-ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. ఎటువంటి సంప్రదింపులు జరపకుండా విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమలోకి రాకుండా నోటీసు అంటించి గేటు బయట నిలుపుదల చేయడం దారుణమన్నారు. కార్మికులు నాలుగు రోజులుగా తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్నా అధికారులు కూడా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

తీరం.. అల్లకల్లోలం

- వాయుగుండం ప్రభావంతో భారీ వర్షం
- ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలు

ఏయూ క్యాంపస్(విశాఖ): వాయుగుండం ప్రభావంతో విశాఖ సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం ప్రజలకు అవస్థలను తెచ్చింది. తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. రాత్రి వేళలో వీటి తీవ్రత మరింత అధికంగా ఉంటోంది.

పొంగి పొర్లుతున్న కాలువలు

వర్షం ప్రభావంతో బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో కాలువలు పొంగి పొర్లుతున్నాయి. వాటిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. వర్షపు నీరు భారీగా కాలువల నుంచి ప్రవహిస్తోంది. యూజీడీ మ్యాన్‌హోళ్ల నుంచి భారీగా మురుగు నీరు రహదారుల పైకి చేరుతోంది.

చెరువును తలపిస్తున్న రోడ్లు

బీచ్ రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వెనుక భాగంలో వైఎంసీఏ నుంచి అంబికా సీ గ్రీన్ హోటల్‌కు వెళ్లే రహదారి వర్షం కురిస్తే చిన్నపాటి చెరువుగా మారిపోతోంది. దీనికి ప్రధాన కారణం ఈ మార్గాన్ని ఆనుకుని ఉన్న పెద్ద మురుగు కాలువ నిండిపోవడమే. వర్షం కురిసిన సందర్భంలో భారీగా వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు అడ్డుపడి కాలువ బ్లాక్ అవుతోంది. దీనితో మురుగు నీరు, వర్షపు నీరు కలిసి రోడ్డును నింపేస్తున్నాయి. విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న ప్రాంతం రోడ్డుకంటే తక్కువ ఎత్తులో ఉండటంతో ఇక్కడ కూడా నీరు నిలిచిపోతోంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వెంటనే ఇక్కడి వ్యర్థాలను తొలగించి, నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ వర్షం కారణంగా ఇసుక కొట్టుకు వచ్చి తీరంలో రోడ్డుపై మేట వేస్తోంది. వీటిని పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు.

దుకాణాల్లోకి సముద్రపు నీరు

ఆర్కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన పలు దుకాణాల్లోకి సముద్రపు నీరు చేరుతోంది. వాయుగుండం ప్రభావంతో భారీ కెరటాలు వస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో కెరటాల తీవ్రత మరింత అధికంగా ఉంటోంది. బస్టాప్‌ను తాకే విధంగా రాత్రి సమయంలో కెరటాలు వస్తున్నాయి. దీంతో తీరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తీరంలో విద్యుత్ స్తంభాలను తాకుతున్న కెరటాలు

‘ఉల్లాస్’తో వయోజన విద్యకు ఊతం

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఉల్లాస్’ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని తెలిపారు. 2024–25 సంవత్సరానికి 11,900 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్ష్యరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పంచాయతీరాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, ఉపాధి హామీ కూలీల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆ సమాచారాన్ని వయోజన విద్య అధికారులకు అందించాలని, వారిని ఈ పథకం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను అక్షరాస్యతా కేంద్రాలుగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి వాలంటరీ టీచరు కనీసం పది మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చూడాలన్నారు. సచివాలయ స్థాయిలో సంక్షేమ సహాయకులు, విద్యా సహాయకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, నిరక్షరాస్యులను గుర్తించి సమాచారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా సేవలందించే టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ పథకానికి సంబంధించి సరఫరా చేసిన పుస్తకాలలోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు వి.ఎస్. సుబ్రమణ్యవర్మ, సహాయ సంచాలకులు డి. చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి, డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, డీఐపీఆర్వో కె.ఇంద్రావతి, శిశుసంక్షేమశాఖ పీడీ కె.అనంత లక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి ఎస్. మంజులవాణి పాల్గొన్నారు.

గురుకులాల సైన్స్ ఫెయిర్ నేడు

యలమంచిలి రూరల్: బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాల, బాలికల గురుకుల పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి గురుకులంలో ఒక రోజు సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్టు గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం తెలిపారు. గురువారం ఆమె గురుకులంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 11 సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి 100కు పైగా ప్రాజెక్టులు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. యలమంచిలి పట్టణం, మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ ఫెయిర్‌ను విజయవంతం చేయాలన్నారు.

క్రేన్ బోల్తా.. స్తంభించిన ట్రాఫిక్



తిరగబడిన క్రేన్

మల్కాపురం(విశాఖ): ఉదయం 2 గంటలు.. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చిరుజల్లులు కురుస్తున్నాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దం.. డాక్‌యార్డ్ సమీపాన సేవామార్గంలో ఓ పెద్ద క్రేన్ తిరగబడింది. ఉదయం 6.30 గంటలైంది. డాక్‌యార్డ్, షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, ఎస్ఆర్, కోరమాండల్ సంస్థల కార్మికులు ఉద్యోగులు సుమారు 12 వేల మంది రాకపోకలు ప్రారంభించారు. క్రేన్ తిరగబడడంతో వేలాది మంది ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. ఐవోసీఎల్‌కు కొత్త పైప్‌లైన్ వేస్తున్నారు. ఈ క్రమంలో 12 టన్నుల బరువుగల పైప్‌లను 50 టన్నుల బరువు గల పెద్ద క్రేన్‌తో అమర్చే పనులు చేపట్టారు. తెల్లవారుజామున 2 గంటల తరువాత ఓ పైప్‌లైన్ అమర్చారు. రెండో పైప్‌లైన్ అమర్చే క్రమంలో నిర్దేశించిన ఎత్తు కంటే ఎక్కువగా క్రేన్ హైడ్రాను లేపడంతో అదుపు తప్పి తిరగబడింది. దీంతో భారీ శబ్దం ఏర్పడింది. క్రేన్ తిరగబడే సమయంలో సమీపంలో కార్మికులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివిధ కంపెనీల్లో షిఫ్ట్‌ల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి రాకపోకలు సాగిస్తారు. క్రేన్ బోల్తా పడడంతో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గంటల తరబడి ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ములగాడ మార్గం ద్వారా ఉద్యోగులు విధులకు హాజరుకావాల్సి వచ్చింది. మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు ఘటన స్థలానికి చేరుకొని దగ్గరుండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన పద్మ నాగేశ్వరరావు

పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటపల్లికి చెందిన తోట పద్మ నాగేశ్వరరావు (58) ఇంటి పైభాగంలో నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఇనుప రాడ్డును మేడ పైకి తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో పద్మ నాగేశ్వరరావు షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు.

క్లుప్తంగా

మరిడిమాంబ పండగ.. ఊరంతా వేడుక



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: మరిడిమాంబ ఉత్సవాన్ని కశింకోటలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి కనకమహాలక్ష్మి వీధి, కస్పావీధి ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను సందర్శించిన భక్తులు, అమ్మవారికి చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి పల్లకీలను వేర్వేరుగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ప్రజలు అమ్మ వారి ప్రతిరూపమైన గరగలను దర్శించి, పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

కశింకోట: పల్లె పండగ కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు, ఎఎస్ పేట, సోమవరం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో సుమారు రూ.8 కోట్ల ఉపాధి పథకం నిధులతో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, ఇతర అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, టీడీపీ నాయకులు కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాస రావు, వేగి గోపీకృష్ణ, జనసేన నాయకుడు కర్రి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టమాటా @ రూ.60

కశింకోట: కశింకోట వారపు సంతలో గురువారం టమాటా ధర కాస్త తగ్గింది. కిలోకి రూ.పది తగ్గింది. గత వారం కిలో రూ.70 ఉండగా, ఈ వారం రూ.60కి విక్రయాలు జరిగాయి. ఉల్లిపాయ నాణ్యతను అనుసరించి రూ.40 నుంచి రూ.60 వరకు, బంగాళాదుంప రూ.40, బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ, కాకరకాయ, బరబాటి రూ.60, గోరు చిక్కుడు, చేమదుంప రూ.80, పాదు చిక్కుడు రూ.వందకు విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 147 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,445	5,445
మొదటి రకం	4,560	5,260
రెండో రకం	3,530	4,040
మూడోరకం	3,340	3,490

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
వీక్షణం	:వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	:శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయం రక్త నిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఏబీ పాటిజివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

రోడ్డు పనులకు వీడని గ్రహణం

- రహదారి విస్తరణకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం
- యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు
- అప్పటి నుంచి అడుగు పడని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, అధికారులు



పెరుగుబజార్-గాంధీబొమ్మ జంక్షన్ రహదారిలో వర్షపు నీరు



అధ్వానంగా పెరుగుబజార్-గాంధీబొమ్మ జంక్షన్ రహదారి

అనకాపల్లి: అనకాపల్లి పట్టణంలో రహదారి పనులకు పట్టిన గ్రహణం ఎన్నాళ్లైనా వీడటం లేదు. ముందు చూపుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించినా.. ఆ తర్వాత వాటిని కొనసాగించడంలో కూటమి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం పట్టణవాసులకు శాపంగా మారింది. ప్రస్తుతం పట్టణంలో రహదారులన్నీ గోతుల మయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పెరుగుబజార్ – గాంధీబొమ్మ జంక్షన్ రహదారి పనులు ముందుకు సాగక రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

కోడ్ ముగిసినా..

పట్టణ జనాభాకు అనుగుణంగా రహదారి విస్తరణకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టింది. పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు విస్తరించేందుకు అక్కడ నివసించే ప్రజలు, వ్యాపారస్తులతో గత ప్రభుత్వం చర్చలు జరిపి, పనులు చేపట్టింది. రహదారి విస్తరణలో నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయం కూడా అందజేసింది. యుద్ధప్రాతిపదికన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేశారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు విద్యుత్ లైన్లు మార్పు చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలో కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కోడ్ ముగిసి, కూటమి ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు అవుతున్నా పనులు మాత్రం పునః ప్రారంభించలేదు. కనీసం తొలగించిన భవన నిర్మాణ వ్యర్థాలను కూడా ఎక్కడికక్కడే వదిలివేయడంతో రాకపోకలకు మరింత కష్టమవుతోంది. రహదారి పెద్ద పెద్ద గోతులతో నిండిపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లతో పాటు వ్యాపారం నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి సరకులు తీసుకువస్తున్న లారీలకు తిప్పలు తప్పడం లేదు. గోతుల్లో పడిపోయి, రాత్రి సమయంలో సుమారు 50మంది వాహనదారులు క్షతగాత్రులయ్యారు. కొన్ని వాహనాలు పాడైపోయాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని రహదారిలో డెబ్రిస్‌ను తొలగించి, వర్షపునీరు డ్రైనేజీల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని, కొత్తరోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారిని వివరణ కోరగా వర్షాలు తగ్గిన తరువాత రహదారిపై ఉన్న డెబ్రిస్‌ను తొలగించి, కొత్త రోడ్డు వేసేందుకు చర్యలు చేపడతామన్నారు. దశల వారిగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని, నెల రోజుల్లో పూర్తిగా కొత్త రహదారి నిర్మిస్తామని తెలియజేశారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



అనకాపల్లిలో గోతుల మయమైన రోడ్లతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ద్విచక్రవాహనదారులు నరకం చూస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. వర్షం వస్తే ఇక అంతే సంగతి. నీరు గోతుల్లో నిల్వ ఉండిపోవడంతో ప్రయాణం చాలా కష్టమవుతోంది.

– సత్తిబాబు, శేఖవీధి, అనకాపల్లి

రహదారి అభివృద్ధి చేయాలి



పెరుగుబజార్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి చూస్తుంటే భయమేస్తోంది. గతంలో పనులు ప్రారంభమవుతున్నాయని ఎంతో సంతోషపడ్డాం. ఆ తర్వాత ఆ రోడ్డును అలా వదిలేశారు. అసలే రోడ్డు మధ్య పెద్ద గోతులు, పక్కనుంచి వెళ్దామన్నా డెబ్రిస్ కుప్పలు.. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. డెబ్రిస్ తొలగిస్తే నీరు డ్రైనేజీల్లోకి వెళ్తుంది. కొత్త రోడ్డు నిర్మిస్తే వాహనదారులకు కష్టాలు తప్పుతాయి. అధికారులు దృష్టి సారించాలి.

– పి.శ్రీను, రేబాక

వైభవంగా గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం బుధవారం రాత్రి గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కోటవీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుంచి గవరపాలెం మీదుగా ఊరేగించి పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయంలో నిలుపుదల చేశారు. పీలావారి ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు మాట్లాడుతూ నెల రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ధ బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి దాడి రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం



కొత్తపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న రీసర్వే డీటీ భాస్కరరావు

కశింకోట: రెవెన్యూ గ్రామ సభల్లో భూముల రీ సర్వేలో లోపాలు, సవరణలు ఉంటే పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. మండలంలోని కొత్తపల్లిలో గురువారం తొలి రెవెన్యూ గ్రామ సభ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు భూ సమస్యలను ఈ సదస్సుల దృష్టికి తీసుకొచ్చి నివేదిస్తే వాటిని పరిశీలించి, పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. 9 మంది తమ భూములను వారసులకు సబ్ డివిజన్ చేసి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తులు ఇచ్చారు. పాస్ బుక్ కోసం మరి కొందరు దరఖాస్తు అందించారు. రీసర్వే డీటీ భాస్కరరావు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం తేగాడ, మధ్యాహ్నం పేరంటాలపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామారావు, ఆర్ఐ రమేష్, స్థానిక సర్వేయర్ జగదీష్, వీఆర్వో నాయుడు బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: వాల్మీకి మహర్షి రచించిన రామాయణం స్ఫూర్తితో ప్రతి వ్యక్తి మానవతా విలువలను, ఆదర్శ భావాలను పెంపొందించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహర్షి చిత్రపటానికి దేవప్రసాద్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రామాయణం రమణీయ కావ్యమన్నారు. యుగాలు మారినా ఆదర్శంగా నిలిచే విధంగా రామాయణాన్ని రచించి, వాల్మీకి మహర్షి సమాజానికి ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. సీఐలు ఎస్.బాలసూర్యారావు, ఎస్.రమేష్, ఎస్ఐ బి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్

కె.కోటపాడు: విద్యార్థులు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సెట్విస్ రీసోర్స్ పర్సన్ ఎస్.ఎ.బాబు అన్నారు. కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో 8 నుంచి10 తరగతి విద్యార్థులతోపాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు గురువారం కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. ఇంటర్వ్యూ సమయంలో ఒత్తిడికి గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా ఉద్యోగార్థులు ఎటువంటి ఒత్తిడి అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. యువత మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలన్న లక్ష్యంతో చదువులు అందిపుచ్చుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింగబిల్లి, ఎన్‌జీ పాలెం, గొబ్బూరు, చింతలపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏనుగుతుని, సోమవరం, చిన ఏనుగుతుని, గొల్లగుంట, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మాసయ్యపేట, గోకివానిపాలెం, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, జోగారావుపేట, పేరంటాలపాలెం, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఎఎస్ పేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లారీ డ్రైవర్ల సమ్మె విరమణ

కశింకోట: మండలంలోని బయ్యవరం సిమెంట్ పరిశ్రమ వద్ద లారీ డ్రైవర్లు తమ జీతాలు పెంచాలని కోరుతూ నాలుగు రోజులుగా జరుపుతున్న సమ్మెను గురువారం విరమించారు. రెండు విడతలుగా జీతాలు పెంచడానికి, మూడు నెలల కిందట నిలిపి వేసిన సదుపాయాలను పునరుద్ధరించడానికి పరిశ్రమ యాజమాన్యం అంగీకరించడంతో లారీ డ్రైవర్లు సమ్మె విరమించినట్లు సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్, జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

చోడవరం రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో 2024–25 గాను ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. ఏపీపీజీ సెట్ –2024 అర్హత పొందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. అడ్మిషన్స్ కొరకు హాజరయిన విద్యార్థులు ఎపీ పీజీ సెట్ అర్హత పత్రం, ఇతర ఒరిజినల్, మరియూ జెరాక్స్ కాపీలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 955039 5298 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పేదలకు ఉచిత వైద్యసేవల ఘనత వైఎస్ కుటుంబానిదే



కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

బుచ్చెయ్యపేట: పేదలకు కార్పొరేటు వైద్య సేవలు అందించిన ఘనత వై.ఎస్ కుటుంబానికే దక్కుతుందని వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం తెలిపారు. గురువారం దిబ్బిడి గ్రామంలో విశాఖకు చెందిన ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలను పరిశీలించిన వీరు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదోడికి, ధనికుడికి ఒకే దగ్గర వైద్య సేవలు అందాలన్న దృఢ సంకల్పంతో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు తీసుకురాగా ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిబాటలోనే నిలిచి పేదోడికి రూ, 25 లక్షల వరకు వైద్య సేవలు అందేలా ఆరోగ్య వైద్య సేవలను విస్తరించారన్నారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించి దృష్టి లోపాలను సరిచేస్తున్న ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ ఆర్. సోములు, వైద్య సిబ్బంది సాయికుమార్, అనూష, మహేంద్ర రోగులకు ఉచిత వైద్య సేవలు మందులు అందించారు.

జడివాన.. జనం హైరానా



కశింకోటలో బురదమయంగా మారిన ఆర్టీసీ బస్ స్టేషన్



చెరువును తలపిస్తున్న పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు



తాళ్లపాలెం కూడలిలో వర్షపు నీరు

కశింకోట: కశింకోట ప్రాంతంలో గురువారం దఫదఫాలుగా కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు వర్షపు నీరు చేరింది. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నీరు నిలిచింది. ఆర్టీసీ బస్ స్టేషన్ బురదమయంగా మారడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగేందుకు అవస్థలు పడ్డారు. బురద వల్ల కొన్ని బస్సులు స్టేషన్‌లోకి రాకుండా రోడ్డు మీదగానే వెళ్లిపోయాయి. తాళ్లపాలెం కూడలిలో వర్షం వల్ల నీరు నిలిచిపోయి చెరువులా మారింది. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది చెందారు. వర్షం వరికి మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వారపు సంత వెలవెల



కశింకోటలో బోసిపోయిన వారపు సంత

కశింకోట: కశింకోటలో గురువారం నిర్వహించిన వారపు సంత వర్షంతో వెలవెలబోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దఫదఫాలుగా వర్షం కురిసింది. దీంతో కొనుగోలుదారులు లేక సంత బోసిపోయింది. సాయంత్రం వర్షం తెరిపివ్వడంతో ప్రజలు తరలివచ్చి కూరగాయలు, మసాల దినుసులు, ఆకుకూరలు, చేపలు, తిను బండారాలు వగైరా కొనుగోలు చేశారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి పూజలు



కలశాలతో పూజలు చేస్తున్న భక్తులు



సంపూర్ణ నారాయణీయం పారాయణ చేస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రమణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నీరాజన మంత్ర పుష్పం, అమ్మవారి మండపంలో 108 కలశాలతో పూజలు, నవదుర్గా మూలమంత్రపూజ, చండీ హోమం నిర్వహించారు. కడిమిశెట్టి మాధురీ నవీన్ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణి సత్సంగ్ బృందంచే సంపూర్ణ నారాయణీయం పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో–చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాల ధరలో కోత అన్యాయం



మాట్లాడుతున్న జోనల్ కార్యదర్శి భద్రం

అనకాపల్లి: విజయ్ విశాఖ డెయిరీకి ఆవు పాలు పోస్తున్న రైతులకు కొనుగోలు ధరలో లీటర్‌కు రూ.3 కోత విధించడం అన్యాయమని సీపీఎం జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని బీరాలు పలుకుతున్న డెయిరీ యాజమాన్యం రైతుల దగ్గర నుంచి సేకరించిన పాలకు ధర పెంచాల్సింది పోయి.. తిరిగి లీటర్‌కు రూ.3 తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. ఆవు పాలు ధర లీటర్ రూ.42 నుంచి రూ.60కు పెంచాలని, సబ్సిడీ ద్వారా రైతుకు దాన, మందులు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కోరుబిల్లి శంకరరావు, చెల్లూరు నాగరాజు, తాకాశి వెంకటేశ్వరరావు, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

చేతి, కుల వృత్తులకు ఆర్థిక సాయం

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి, కుల వృత్తులకు ఆర్థిక సాయం అందజేస్తున్నాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ శంకర్‌నారాయణ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన చేతివృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతి, కుల వృత్తి వారిని ఆర్థికంగా అదుకునేందుకు ప్రభుత్వం త్వరలో అత్యాధునిక పనిముట్లను అందజేయడానికి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో చేతి, కుల వృత్తుల ప్రజలు చేరాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగ వాయిదా

కశింకోట: మండలంలో నిర్వహిస్తున్న పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం వర్షాల కారణంగా మూడు రోజులు వాయిదా వేసినట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడిందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో చెబుతామన్నారు.